
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
5
మంగళవారం 28 జనవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 19.0




ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలి

గద్వాల న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రజలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ... మా కాలనీలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో చిన్నారులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గద్వాలకు పంపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పాటు కాలనీలో రోడ్లు సరిగా లేవని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మద్దిలేటి, లింగన్న, రాజు, రమేష్, తిమ్మప్ప, రామలింగం, పరశురాముడు పాల్గొన్నారు.

కల్వకుర్తి ప్రజల కలలను సాకారం చేస్తా

- రహదారులు, విద్య, వైద్య రంగాలకు పెద్దపీట
- కల్వకుర్తి ఆస్పత్రిని వంద పడకలకు విస్తరిస్తా
- ఆమనగల్‌లో 50 పడకల ఆసుపత్రికి శ్రీకారం
- ఎంజీకేఎల్ఐ ద్వారా చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగునీరందించడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- ఆమనగల్‌లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తా
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించిన కల్వకుర్తి నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా ఎన్నికైన అరుదైన అవకాశం నాకు దక్కింది. కల్వకుర్తి వాసుల కలలను నెరవేర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తా. పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడానికి శాయశక్తుల కృషిచేస్తా. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తా. పకడ్బందీ ప్రణాళికతో ముందడుగు వేస్తా. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలుపొందిన అనుభవం కల్వకుర్తి ప్రాంత బిడ్డగా ఇక్కడ ఉన్న సమస్యలపై నాకున్న స్పష్టమైన అవగాహన, సమగ్రాభివృద్ధికి దోహదపడుతాయని భావిస్తున్నానని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్యాపరంగా అభివృద్ధి చెందితేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చు అనేది నా ప్రగాఢ విశ్వాసం. నేను కూడా విద్యాసంస్థల స్థాపన ద్వారానే జీవితంలో, రాజకీయంగా ఎదిగాను. కల్వకుర్తిని విద్యాహబ్‌గా రూపొందించాలనేది నా సంకల్పం. అందులో భాగంగా ఆమనగల్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయనున్నాం. పాలిటెక్నిక్ కాలేజ్ కూడా అక్కడే స్థాపించాలనే ప్రణాళికతో ముందుకెళ్తున్నాను.

తలకొండపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించనున్నాం. ఖానాపూర్, తాండ్రా, మాడ్గుల మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు రూ.15కోట్లు వెచ్చించనున్నాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము.

రహదారుల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ ఉందా?

పక్కాగా ఉంది. రూ.40కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణం పురోగతిలో ఉంది. అదనంగా మరో రూ.20 కోట్లు మంజూరు

(మిగతా 6లో..)

నియోజకవర్గ అభివృద్ధిపై మీకున్న ప్రణాళిక ఏంటి?

మారుమూల ప్రాంతంలో పెరిగి విద్యాభివృద్ధికి దోహదపడుతూ కల్మశం లేని రాజకీయాలను ప్రోత్సహిస్తూ రెండుసార్లు ఎమ్మెల్సీగా.. ఈసారి ఎమ్మెల్యేగా గెలుపొందాను. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నాకంటూ ప్రత్యేక కార్యాచరణ ఉంది. జిల్లావాసి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కల్వకుర్తి అభివృద్ధికి కలిసొచ్చిన శుభ పరిణామం.

వైద్యపరంగా కల్వకుర్తిలో ఏవైనా కొత్త ప్రణాళిక చేశారా?

హైదరాబాద్ నుంచి శ్రీశైలం జాతీయ రహదారి ఉండడం కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనేక తండాలు కూడా ఉండడంతో వైద్య పరంగా మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకతను పరిగణనలోకి తీసుకున్నాను. ఇందులో భాగంగా కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలకు విస్తరించనున్నాం. మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్‌లో 30 పడకల ఆస్పత్రుల నిర్మాణం, నియోజకవర్గంలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. సాధ్యమయ్యేంత త్వరలో వీటికి పరిపాలన ఆమోదం లభించనుంది. ఆమనగల్‌లో 50పడకల ఆస్పత్రిని నిర్మించే ప్రక్రియ ప్రారంభమైంది.

ఖాతాల్లో 'రైతు భరోసా'

- జోగులాంబ గద్వాల జిల్లాలోని 13 గ్రామాల్లో 7,829 మంది రైతులకు రూ.12.47 కోట్లు
- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మల్దకల్ మండలం నాగర్‌దొడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

7

ఆకలి తీరుస్తూ స్వయం ఉపాధి

7

ఫిట్స్‌తో విద్యార్థి మృతి

- న్యాయం చేయాలని వనపర్తి ఏరియా ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన

7

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

- నిర్వాహకుడితో పాటు ఇద్దరు యువతులు, ఐదుగురు విటుల అరెస్ట్

రూ.90.20 కోట్లతో అభివృద్ధి

ఐదేళ్లలో గద్వాల మునిసిపాలిటీలో చేసిన ఖర్చు

- తాగునీరు, సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి పెద్దపీట
- పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కులు
- ప్రత్యేక పాలనలోకి మునిసిపాలిటీలు..

6



గద్వాల మునిసిపల్ కార్యాలయం

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ఫిర్యాదులతో పాటు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు తమతమ దరఖాస్తులతో వివిధ శాఖల్లో పరిష్కారాన్ని కోరుతూ నేటి ప్రజావాణికి మొత్తం 50ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎనిమిది మంది ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

రూ.49 లక్షలకు పశువుల సంత, తైబజారు వేలం

బిజినేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఆనందగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని నిర్వహించే బిజినేపల్లి పశువుల సంత, తైబజారును వేలం పాటలో గ్రామానికి చెందిన ఇండ్ల శ్రీను రూ.49 లక్షలకు దక్కించుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం డీఎల్‌పీవో వరలక్ష్మి, పంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీవో నరసింహులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యాపారులు వేలం పాటలో పాల్గొన్నారు. ప్రభుత్వ అప్‌సెట్ ధర రూ.46,87,900 ఉండగా వేలం పాట రూ.49 లక్షలు పలికింది. దీంతో మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన వేలం పాట ఒక రోజులోనే ముగిసింది. అనంతరం పశువుల సంత, తైబజారు దక్కించుకున్న శ్రీనును అధికారులు, పంచాయతీ సిబ్బంది సన్మానించారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ హయాంలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని తన నివాసంలో రూ.11 లక్షల 27వేల సీఎం సహాయనిధి చెక్కులతో పాటు రూ.3 లక్షల 50వేల ఎల్‌వోసీలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోగ్య బీమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని, ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బీ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కోట్ల రవి, రాగి వేణు, కదిరె రాములు, ఎండీ బాబా తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

- డీఈవో రమేశ్‌కుమార్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

కల్వకుర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని డీఈవో రమేశ్ కుమార్ అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సాంకేతికతతో కూడిన విద్యాబోధన చేయాలని ఆయన సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేందుకు విద్యాబోధన చేయాలని సూచనలు చేశారు. అనంతరం పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డీఈవో వెంట ఎంఈవో శంకర్‌నాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 67 ఫిర్యాదులు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయాలి

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్ యాదవ్

వనపర్తి మునిసిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై దర్యాప్తు చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్ యాదవ్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజావాణిలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మునిసిపాలిటీలో ఐదు సంవత్సరాలలో జరిగిన అవినీతి ప్రస్తుతం జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలన్నారు.

నత్తనడకన ఆస్తిపన్ను వసూలు



నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ కార్యాలయం

- నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో వసూలు కావాల్సింది రూ.17.61 కోట్లు
- రెండు నెలల్లో లక్ష్యం నెరవేరేనా?

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూలు నత్తనడకన సాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా రెండు నెలలే ఉంది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు కలిపి మొత్తం రూ.17.61 కోట్లు ఉండగా నేటికి రూ.6.04 కోట్లు మాత్రమే వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ 34.28 శాతమే వసూలు కావడంతో మిగిలిన రెండు నెలల్లో లక్ష్యం చేరుకోవడం అనుమానంగానే ఉంది. మునిసిపాలిటీల్లోని సంబంధిత అధికారులు ఆస్తిపన్ను వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వెనుకబడిన కల్వకుర్తి మునిసిపాలిటీ

జిల్లాలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి మునిసిపాలిటీలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో రూ.6.61 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికీ రూ.2.83 కోట్లు మాత్రమే వసూలైంది. కొల్లాపూర్‌లో రూ.1.27 కోట్లకు గాను రూ.56 లక్షలు, అచ్చంపేటలో రూ.1.85 కోట్లకు గాను రూ.95 లక్షలు, కల్వకుర్తిలో రూ.7.88 కోట్లకు గాను రూ.1.67 కోట్లు వసూలైంది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో అత్యధిక డిమాండ్ ఉన్న కల్వకుర్తి మునిసిపాలిటీలో ఏడాది పొడవునా కేవలం 21.19 శాతం వసూలు కావడంతో మిగిలిన రెండు నెలల్లో వంద శాతం వసూలు చేయడం కష్టంగానే కనిపిస్తోంది.

భారం లేకుండా వసూలు చేయాలి

మునిసిపాలిటీల్లో అభివృద్ధి, పారిశుధ్యం, ఇతర పనుల నిర్వహణకు ఆస్తిపన్నే ఆర్థిక వనరు. కానీ వాటి వసూలులో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం సరికాదు. ఏడాది పొడవునా పట్టనట్లు వ్యవహరించి చివరి నెలలో ఆస్తిపన్ను చెల్లించాలని ప్రజల వెంట పడడం సరికాదు. ఇప్పటి నుంచే ప్రజలకు అవగాహన కల్పించి భారం లేకుండా వసూలు చేయాలి.

- వావిలాల రాజశేఖర్‌శర్మ, సామాజిక కార్యకర్త, నాగర్‌కర్నూల్

ప్రజావాణికి 55 ఫిర్యాదులు

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీపురం బీసీ కాలనీకి చెందిన వాడే వెంకటేశ్(38) అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. ఇంట్లో గొడవ పడి డిసెంబరు 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వెంకటేశ్ చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వెంకటేశ్‌కు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

నక్షా పేరుతో పైలెట్ ప్రాజెక్టు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ డిజిటల్ ఇండియా భూరికార్డుల కార్యక్రమం కింద నేషనల్ జియోస్పెషియల్ నాలెడ్జి బెస్ట్ లాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్(నక్షా) పేరున ఏడాది పాటు పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ సెక్రెటరీ మనోజ్ సిన్హా తెలిపారు. ఈ నక్ష ప్రాజెక్టు ఉద్దేశాలు, లక్ష్యాలు అమలుపై వివిధ రాష్ట్రాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 26 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 152 మునిసిపల్ పట్టణాల్లో భూరికార్డుల నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకోసం కేంద్ర వ్యయ విభాగం ఈ ఆర్థిక సంవత్సరం రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడి ప్రోత్సాహకంగా ప్రకటించిందని తెలిపారు. భూ రికార్డుల ఆధునికీకరణకు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఐసీ భాగస్వామ్యంతో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహనరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు సహాయ సంచాలకుడు కిషన్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


శ్రీను (ఫైల్)

అచ్చంపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని పెద్ద తండా గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు కేతావత్ శ్రీను(48) తన వ్యవసాయ పొలంలో వేరుశనగతో పాటు వరిని సాగుచేశాడు. ప్రతీరోజు మాదిరిగానే సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్ళాడు. బోరు మోటారు నడవకపోవడంతో మరమ్మతు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసేందుకు వెళ్లాడు. స్విచ్‌ఆఫ్ చేసేందుకు చేతి రుమాలుతో ప్రయత్నం చేశాడు. షార్టుసర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే రైతు మృతి చెందాడు. ఎల్‌సీ తీసుకునేందుకు అంతకుముందు విద్యుత్ లైన్‌మన్‌కు ఫోన్ చేశాడని, తమకు తెలియదని ఆయన చెప్పాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఎల్ సీ ఇచ్చి ఉంటే శ్రీను బతికేవాడని స్థానికులు అన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య కేతావత్ తారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఎలా?

- కోస్గి దేవుని చెరువు కట్ట తవ్వడంపై ఇరిగేషన్ అధికారుల ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు


పైపులైన్ వేసి, ఎక్స్‌కవేటర్‌తో మట్టిని పూడ్చేయిస్తున్న అధికారి

కోస్గి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సహించేది లేదని ఇరిగేషన్ జేఈ పవన్, నిర్మల అన్నారు. సోమవారం పట్టణంలోని దేవునిచెరువు కట్టను తెంచి పైపులైన్ వేస్తున్నా రన్న సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెరువు కట్టను తెం చిన వ్యక్తి సాయప్పపై ఇరిగేషన్ అధికారులు తహసీల్దార్‌తో పాటు, ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వారన్నారు. అదే క్రమంలో దండంచెరువు చుట్టు చెరువుకు మోటార్లు బిగించి నీరు తీస్తున్నారు. విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్‌ను ఎలా ఇస్తున్నారో తెలియడం లేదని, వారిపై కూడా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

తల్లి మందలించిందని కూతురి బలవన్మరణం

అనంతపురంలో ఘటన

గద్వాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లమని కూతురిని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అనంతపురం చెందిన పావని(16) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన మనెమ్మ తన భర్త గతంలోనే మృతి చెందడంతో ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తుంది. చిన్న కూతురు పావని ఇంటర్ చదువుతుంది. కళాశాలకు వెళ్లకపోవడంతో సోమవారం ఉదయం తల్లి మందలించింది. ఆ తర్వాత తల్లి వ్యవసాయ పనులకు వెళ్లిపోయింది. మన స్థాపం చెందిన పావని ఇంట్లో ఉరేసుకుంది. పనుల నుంచి ఇంటికి వచ్చిన తల్లి తలుపుకొట్టిన తీయకపోవడంతో పక్కింటివారి సాయంతో ఇంట్లోకి వెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి తరలిస్తున్న టిప్పర్ల వద్ద రెవెన్యూ సిబ్బంది

మూసాపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రంలోని గ్రామ శివారు సర్వే నెంబర్ 161లో మొరం మట్టిని తరలించొద్దని కాటవరం గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి అండర్‌పాస్ సబ్‌రోడ్డు నిర్మాణ పనుల కోసం ఓ ప్రైవేటు కంపెనీ వారు అనుమతి తీసుకుని మొరం మట్టిని తరలిస్తుండగా ఇక్కడి నుంచి మట్టిని తరలించడానికి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారంటూ వాహనదారులను నిలదీశారు. సమాచారం అందుకున్న మండల కార్యాలయ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. అనుమతి ఉన్నా ఇక్కడి నుంచి మట్టి తరలించొద్దని గ్రామస్థులు అడ్డుపడినా.. వాహనదారులు మట్టిని తరలించారు.

బ్యాంకుకు క్యూ కట్టిన రైతులు

డబ్బులు పడకపోవడంతో నిరాశతో వెనక్కి.

ధన్వాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.ఆరు వేలు రైతు ఖాతాలో గణతంత్ర దినోత్సవం మధ్యరాత్రి నుంచే జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు బ్యాంకులకు క్యూ కట్టారు. ధన్వాడలోని యూనియన్ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్దకు రైతులు ఉదయమే చేరుకొని తమ ఖాతాలను చెక్ చేసుకున్నారు. అయితే ఖాతాలో డబ్బులు పడకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. డబ్బులు పడకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఏ ఒక్క రైతుకు బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డట్టు మెసేజ్ రాలేదు. ప్రభుత్వం ఇలా చేస్తే ఎలా అంటూ పలువురు ప్రశ్నించారు.

ప్రతీ విద్యార్థి లక్ష్య సాధనలో రాణించాలి


మాడల్ పేపర్లు అందుకున్న పదో తరగతి విద్యార్థులతో చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేఖార్ అలీ

- పేద విద్యార్థుల చదువుకు సహాయం అందిస్తాం
- చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేఖార్ అలీ

ఊట్కూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి లక్ష్య సాధనలో రాణించాలని చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేఖార్ అలీ కోరారు. సోమవారం ఊట్కూర్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత మాడల్ పేపర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలన్నారు. ముస్లిం అబ్బాయిలు, అమ్మాయిలు ఎవరికన్నా తక్కువ కాదని చదువులో రాణించి నిరూపించాలన్నారు. ఎంఐఎం పార్టీకి ఊట్కూర్‌పై అభిమానం ఉందని, ఇక్కడి పేద విద్యార్థుల చదువుకు ఆర్థికంగా సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు ఎంఐఎం పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జాబెర్‌బిన్‌సైద్ అల్‌జాబ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఊట్కూర్ మండల అధ్యక్షుడు అబ్దుల్ రహేమాన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్, నాయకులు ఎండీ. పాషా, ముజాహిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలు అందించాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలం ఇతర అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాపై నిఘా పెంచి కట్టడి చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా జిల్లాలో జరిగిన నేరాలు, ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. ఫారెస్ట్ అధికారి ప్రసాద్‌రెడ్డి, ఆర్డీవో మేఘాగాంధీ, అధికారులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ప్రజల కలలను సాకారం చేస్తా



(5వ పేజీ తరువాయి..)

కానున్నాయి. రహదారులు, భవనాల శాఖ నుంచి రూ.189 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనున్నాం. కొట్ర నుంచి కల్వకుర్తి వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.45కోట్లు వెచ్చించనున్నాం. వెల్దండ నుంచి సిర్సనగండ్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.35 కోట్లు, తలకొండపల్లి నుంచి కొట్ర గేటు వరకు రోడ్డు విస్తరణకు రూ.35కోట్లు, జూపల్లి నుంచి వంగూరు గేటు వరకు డబుల్ లేన్ నిర్మాణానికి రూ.9కోట్లు. ఆమనగల్ మండలం కోనాపూర్ నుంచి మాడ్గుల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్లు, మాడ్గుల నుంచి దేవరకొండ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ కోసం మరో రూ.25కోట్లు వెచ్చించనున్నాం. రాబోయే 25 ఏళ్ల వరకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా రహదారుల నిర్మాణం చేపట్టాలనేది నా భావన. అందుకనుగుణంగానే కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నాం.

వ్యవసాయ పరంగా నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయనున్నారు?

నీటి సౌలభ్యం తక్కువగా ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో [illegible] స్పందనతో ఉంటాయని ఆశిస్తున్నాను.

వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


చిట్యాల చేయూత అనాథాశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న రజిని

వనపర్తి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ రజిని అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని వృద్ధాశ్రమాన్ని, చిట్యాల శివారులోని చేయూత అనాథ ఆశ్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆశ్రమాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారు రోజు కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు అల్పాహారం భోజనం, ప్రస్తుతం వాడుతున్న బియ్యం, కూరగాయలు తనిఖీ చేశారు. అదే మాదిరిగా వసతిగృహాల శుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అనాథాశ్రమంలో నిర్వాహకులు లైబ్రరీ, డ్రాయింగ్ కిడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య, లోక్‌అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయుడి బ్రహ్మోత్సవాలు


ఆలయ ఆవరణలో ముస్తాబైన అభయుడి తేరు

ఊర్కొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. జై శ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సోమవారం రాత్రి (తెల్లవారితే మంగళవారం) రథోత్సవం నిర్వహించనున్నందుకు కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐలు నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి ఎస్సైలు వీరబాబు, మాధవరెడ్డి, మహేందర్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవం పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతున్నదని ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

రూ.90.20 కోట్లతో అభివృద్ధి

ఐదేళ్లలో గద్వాల మునిసిపాలిటీలో చేసిన ఖర్చు

- తాగునీరు, సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి పెద్దపీట


గద్వాలలో సుంకులమ్మ మెట్టులో ప్రజలకు ఆహ్లాదానిస్తున్న పార్కు

గద్వాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లలో గద్వాల మునిసిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందింది. ఒకపక్క పాలకవర్గానికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వకపోయిన 15వ ఆర్థిక సంఘం, ప్రభుత్వ గ్రాంట్స్‌తో వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నం చేసింది. ఈ ఐదేళ్లలో గద్వాల మునిసిపల్ పాలకవర్గం రూ.90.20కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు వాటిని పూర్తిచేసి ప్రజల మెప్పు పొందింది. గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి తమ పాలనను పూర్తి చేసింది. సోమవారం నుంచి ప్రత్యేక పాలనలోకి వెళ్లింది. జిల్లాలోని గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మునిసిపాలిటీలకు అదనపు కలెక్టర్ నర్సింగరావును ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా నియమించింది.

పారిశుధ్యానికి పెద్దపీట

మునిసిపాలిటీలోని ప్రధాన పనులకు పబ్లిక్ హెల్త్ నిధులను రూ.41.60 కోట్లు ఖర్చు చేశారు. తాగునీరు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని అన్ని వార్డులలో రూ.30.65 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేశారు. ఇందుకోసం 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు సీఎం, పురపాలకశాఖ మంత్రి ఇచ్చిన ప్రత్యేక నిధులను సద్వినియోగం చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.2 కోట్లు విడుదల కాగా నాలుగు ఎస్సీ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి వినియోగించారు.

పట్టణ ప్రగతితో పార్కుల అభివృద్ధి

పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశ్యంలో గత ప్రభుత్వం పట్టణ ప్రగతికి నిధులను కేటాయించింది. పట్టణంలో 37 వార్డులు ఉండగా 27 వార్డులలో మేజర్ పార్కులు, మినీ పార్కులను అభివృద్ధి చేసింది. ఒక్కో పార్కుకు రూ.50లక్షల నుంచి కనిష్టంగా రూ.20లక్షల వరకు ఖర్చు చేసింది. ఇవే కాకుండా పట్టణ ప్రగతి నిధులతో 1వ వార్డు, 32వ వార్డులలో వైకుంఠధామాలను నిర్మించింది. అదేవిధంగా సంగాల చెరువు దగ్గర చెన్నకేశవ పార్కును అభివృద్ధి చేశారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు రూ.1.11కోట్లు ఖర్చు చేశారు. కర్నూల్ రోడ్డు, అయిజ రోడ్డు, రాయిచూర్‌రోడ్డు వెంట సెంట్రల్ లైటింగ్‌కు రూ.7.70కోట్లను ఖర్చు చేశారు.

ఇతర అభివృద్ధి పనులు

పట్టణంలో ప్రధాన సమస్య చెత్త సేకరణ. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి. అందుకోసం రూ.1.42 కోట్లతో డంపింగ్ యార్డును అభివృద్ధి చేశారు. అదేవిధంగా శానిటేషన్ వాహనాలు, ఇతర మిషన్ల మరమత్తులు, నూతన వాటి కొనుగోలుకు రూ.2.40కోట్లను ఖర్చు చేశారు. క్రిమిటోరియం, వైకుంఠధామాల నిర్మాణానికి రూ.1.28కోట్లను ఖర్చు చేశారు. కొండపల్లి రోడ్డులో రూ.2 కోట్లతో ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం, పట్టణంలో మూత్రశాలల నిర్మాణానికి రూ.32 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు దాదాపు రూ.కోటి ఖర్చు చేశారు.

ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉండే...



ఐదేళ్లలో సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేశాం. పట్టణం విస్తరించడంతో కాలనీలు, విలీన గ్రామాలలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రభుత్వం కూడా అనుకున్న స్థాయిలో నిధులు ఇవ్వలేదు. సీఎంతో పాటు, పురపాలక మంత్రి ఇచ్చిన ప్రత్యేక నిధులు కొంతమేరకు ఉపయోగపడ్డాయి. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకున్నాం.

- బీఎస్ కేశవ్, మాజీ మునిసిపల్ చైర్మన్, గద్వాల

డైట్ మెనూ పకడ్బందీగా అమలు చేయాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి


సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్ గోపిడి

మన్ననూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న డైట్ మెనూ ను గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాల్లో పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా పరిధిలో గల 29 గిరిజన ఆశ్రమ, వసతి గృహాలు, 10 గురుకులాలు, మినీ గురుకులాల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలకు డైట్ మెనూ అమలుపై సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన మెనూ ఉందని, అమలు చేసే బాధ్యత ఆయా విద్యాసంస్థల్లోని వార్డెన్లు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, మెనూ ఇన్‌చార్జిలు తీసుకోవాలన్నారు. విద్యాలయాలకు సరఫరా అయ్యే సరకులు, కూరగాయలు, గుడ్లు, పండ్లు నాణ్యత పరిశీలించాలన్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని నిర్వాహకులు రుచి చూసిన తర్వాతే వడ్డించాలన్నారు. ఆహార పదార్థాలు నాణ్యత లోపిస్తే విద్యార్థులు అస్వస్థతకు గురవుతారని, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఆర్‌సీవో సరస్వతి, గిరిజన సంక్షేమశాఖ ఉప విద్యాధికారి శంకర్, ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

క్రీడలతో మానసికోల్లాసం

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, రూరల్ 27 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా, పెబ్బేర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీపీఎల్-15 (పెబ్బేరు ప్రీమియం లీగ్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి తనకు నచ్చిన క్రీడలో పాల్గొనడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎక్కువ మంది యువకులు క్రికెట్‌పై మక్కువ చూపుతున్నారని తెలిపారు. పోటీల్లో రాణించి, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కరణశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, కర్రెస్వామి, వెంకటేశ్, విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర జట్టు కోచ్‌గా మన్యంయాదవ్



మన్యం యాదవ్

పెద్దమందడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మన్యం యాదవ్ హాకీ రాష్ట్ర జట్టు కోచ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి రెండు వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -19 హాకీ టోర్నమెంటులో పాల్గొనే తెలంగాణ హాకీ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొలమోని కుమార్, కోశాధికారి నిరంజన్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు శాంతన్న అభినందించారు. హాకీ రాష్ట్ర జట్టు క్రీడాకారులు సోమ వారం జార్ఖండ్‌కు బయలుదేరి వెళ్లారు.

నేడు జిల్లా రగ్బీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రగ్బీ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆదిలబాద్ జిల్లా, మంచిర్యాలలో వచ్చే నెల ఒకటి నుంచి మూడవ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉద యం 9.30 గంటలకు స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, బోనఫైడ్ ధ్రువపత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక అక్రమ రవాణా

» ఏడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్ పట్టివేత

పెబ్బేరు/ మానవపాడు, రూరల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్, మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, రంగాపురం శివారులోని ఊకచెట్టు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా, పంచలింగాల సమీపంలోని తుంగభద్ర నది నుంచి ఇసుకను టిప్పర్‌లో అనుమతి లేకుండా జోగుళాంబ గద్వాల జిల్లాకు తీసుకొస్తున్నారు. జిల్లాలోని మానవపాడు మండలంలోని జల్లాపురం శివారులోని ఆర్డీఎస్ కాలువ మీదుగా ఇసుక టిప్పర్ వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సంఘటనపై కానిస్టేబుల్ గిరిబాబు ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ వెంకటప్రతాప్ నాయుడుపై కేసు నమోదు చేశారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో చోరీ

పెంట్లవెల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. పురోహితుడు లోకేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పురోహితుడు ఆదివారం సాయంత్రం పూజ ముగించుకొని ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆలయం తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, స్వామివారి 10 తులాల వెండి అభరణాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. హుండీలో దాదాపు ఐదువేల రూపాయలు ఉండొచ్చని పురోహితుడు తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి లబ్ధిదారుల నుంచి కిలో రూ.10 చొప్పున నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎనిమిది బస్తాల్లో పోసి తన ఇంట్లో నిల్వ ఉంచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ నెల 26న గుర్తించి, మండల కేంద్రంలోని రేషన్ డీలర్ చంద్రకళ వద్ద ఉంచారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ దుబ్బాక పరమేశ్ సోమవారం పరిశీలించి రేషన్ బియ్యమని ధ్రువీకరించారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ. ఐదు లక్షలు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్లో డబ్బు జమ చేస్తే అధిక వడ్డీ ఇస్తామని ఆశ పెట్టి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి ఐదు లక్షల రూపాయలు లక్షలు స్వాహా చేశారు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని, ఓంనగర్ కాలనీకి చెందిన కె.సంతోష్‌కు డెకట్ లోన్ యాప్ పేరుతో సామాజిక మాధ్యమంలో ఓ లింక్ వచ్చింది. క్లిక్ చేయడంతో డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ వస్తుందన్న సమాచారం వచ్చింది. దీనిని నమ్మిన సంతోష్ ఈ నెల ఒకటి నుంచి 16వ తేదీ వరకు రూ. 5,25,640 జమ చేశారు. ఆ తర్వాత యాప్ బంద్ కావడంతో ఆందోళనకు గురయ్యాడు. మోసపోయినట్లు గుర్తించి, సోమవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కేఎల్ఐ కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు అమ్ముదామనుకుంటే, అక్కా చెల్లెళ్లు అడ్డు చెప్పడంతో ఆవేదన చెందిన ఓ వ్యక్తి కేఎల్ఐ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన జంగం మల్లేశ్ (40) తన ఇంటిని అమ్మాలనుకున్నాడు. కానీ అతడి అక్కా చెల్లెళ్లు అడ్డుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఆదివారం సాయంత్రం కేఎల్ఐ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై అక్క అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



ఆకలి తీరుస్తూ.. స్వయం ఉపాధి

» రహదారుల పక్కన మినీ హోటళ్లు, మొబైల్ క్యాంటిన్ల నిర్వహణ
» బాటసారులకు రుచికరమైన ఆహారం - పెద్ద హోటళ్ల కన్నా ధర తక్కువ
» రూ.80కే శాకాహారం, రూ.100కే మాంసాహారం

జడ్చర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకే రుచికరమైన భోజనం అందిస్తూ, బాటసారుల ఆకలి తీరుస్తూ.. కొందరు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా టెంటు హోటళ్లు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మరికొందరు మొబైల్ క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కన హోటల్ నిర్వహణను చిన్నచూపు అనుకోకుండా, ఆత్మగౌరవంగా భావిస్తున్నామని వారు చెప్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారి, ప్రధాన రహదారుల పక్కన మినీ మెస్, మినీ హోటల్, మొబైల్ మెస్‌ల పేరుతో చిన్న టెంట్లు వేసుకొని, హోటళ్లు నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.

తక్కువ ధరకే మంచి భోజనం

పట్టణాలు, మండల కేంద్రాల్లోని హోటళ్లలో సాధారణ భోజనానికి రూ.100 నుంచి రూ. 150, మాంసాహారానికైతే రూ. 200 నుంచి రూ. 300 వరకు ఖర్చు అవుతుంది. కానీ ఈ రహదారుల పక్కనున్న టెంటు హోటళ్లలో రూ.80కే భోజనం, రూ.90కు గుడ్డుతో భోజనం, రూ.100కు మాంసాహారం అందిస్తున్నారు. తమ వద్ద పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు, లారీ డ్రైవర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా భోజనం చేసి సంతృప్తి చెందుతున్నారని నిర్వాహకులు చెప్తున్నారు. వంట సరుకులు, కూరగాయలు, ఇతరత్రా ఖర్చులు పోను, ప్రతీ రోజు దాదాపు రూ.500 నుంచి రూ.800 వరకు మిగులుతున్నాయని, దీంతో ఆత్మగౌరవంతో జీవిస్తున్నామని అంటున్నారు.

వాహనాలతో ఇబ్బందులు

అయితే రహదారుల పక్కన చిన్న, చిన్న హోటళ్లు నిర్వహిస్తూ వారు జీవనోపాధి పొందడంతో పాటు బాటసారులకు తక్కువ ధరకే భోజనం అందించడం అభినందనీయం. కానీ ఈ హోటళ్లలో భోజనం చేసేందుకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అభిప్రాయపడ్తున్నారు. వాహనాలు నిలిపేందుకు ఖాళీ స్థలం ఉన్న ప్రాంతాల్లో ఈ హోటళ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్తున్నారు. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

సంతృప్తి చెందుతున్నారు



మల్లేష్, పెద్దపల్లి, హోటల్ యజమాని : స్వయం ఉపాధి కోసం భార్యాభర్తలం ఇద్దరం రోడ్డు పక్కన గుడారం వేసి హోటల్ నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు హోటల్ నిర్వహణ ఖర్చు పోను, రూ.500 నుంచి రూ.800 మిగులుతున్నాయి. భోజనం తిన్న వాళ్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హోటల్ నిర్వహిస్తూ ఆత్మగౌరవంతో బతుకుతున్నం.

వలస పోకుండా..



సంధ్య, సింగమ్మగడ్డతండా, రాజాపూర్, హోటల్ యజమాని : ఉపాధి కోసం వలస పోకుండా చిన్న హోటల్ నిర్వహించుకుంటూ భార్యాభర్తలం స్వయం ఉపాధి పొందుతున్నం. కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి హాయిగా జీవనం సాగిస్తున్నాం. అతి తక్కువ ధరకు తిన్నంత భోజనం పెడ్తున్నాం. మా హోటల్‌లో భోజనం చేసిన రుచిగా, శుచిగా ఉందని సంతృప్తి వ్యక్తం చేస్తుండటం సంతోషంగా ఉంటోంది.

స్వయం ఉపాధి కోసం..



శ్రీధర్, బాలానగర్, హోటల్ యజమాని : ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలపై ఎదురుచూడకుండా, స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో మొబైల్ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నాను. కుటుంబ సభ్యులు ఇంట్లోనే వంట చేస్తారు. వంట పాత్రలను మొబైల్ క్యాంటీన్‌లో సర్దుకొని బాలానగర్ సమీపంలోని పరిశ్రమల వద్దకు తీసుకెళ్తాను. అక్కడి కార్మికులకు తక్కువ ధరకే రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నాను.

తక్కువ ధరకే మంచి ఆహారం



నాగరాజు, టిప్పర్ డ్రైవర్, డోకూరు : తక్కువ ధరకే కడుపు నిండా భోజనం చేస్తున్నా. నేను టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాను. డ్యూటీకి వచ్చేటప్పుడు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకోవడం కుదరడం లేదు. దీంతో జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న టెంటు హోటళ్లలోనే భోజనం చేస్తాను. ఇక్కడ నాణ్యమైన ఆహారం దొరుకుతోంది. ఇంటి భోజనంలా ఉంటోంది.

చిన్న హోటళ్లే మేలు



నవీన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్ : సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పెద్ద, పెద్ద హోటళ్లలో భోజనం చేసే వాడిని. కానీ జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు ప్రక్కన ఉన్న ఈ చిన్న హోటల్‌లో భోజనం చేయడంతో ఎంతో తృప్తిగా ఉంటుంది. పెద్ద హోటళ్లలో వినియోగించే సరుకులు ఎలా ఉంటాయో తెలియవు. కానీ ఈ చిన్న హోటళ్ల నిర్వహించే వారు పేదలు కాబట్టి, వారికి భోజనం విలువ తెలుసు కాబట్టి నాణ్యమైన భోజనం అందిస్తారు.

భోజనం బాగుంది



వెంకటయ్య, లారీ డ్రైవర్, చింతపల్లి, నల్గొండ : జాతీయ రహదారి పక్కన టెంట్ వేసి నిర్వహిస్తున్న హోటల్‌లో భోజనం ఎంతో బాగుంది. లారీ డ్రైవర్‌గా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రయాణిస్తుంటాం. హోటళ్లు, దాబాల్లో భోజనం చేస్తే అనారోగ్యానికి గురవుతున్నాం. కానీ ఈ చిన్న హోటళ్లలో తింటే హాయిగా ఉంటోంది.

రంగనాయకస్వామి గుట్టపై 13వ శతాబ్దం నాటి శిల్పాలు

» పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



మహిషాసుర మర్దిని, భైరవుడి విగ్రహాలను చూపిస్తున్న పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

జడ్చర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి పాతబజారు సమీపంలోనున్న రంగనాయకస్వామి గుట్టపై 13వ శతాబ్దం నాటి శిల్పాలున్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. రంగనాయకస్వామిగుట్టను సోమవారం ఆయన సందర్శించారు. గుట్టమీది ప్రధాన ఆలయం, వెనుక 13వ శతాబ్దం నాటి మహిషాసుర మర్దిని, భైరవుడి శిల్పాలను గుర్తించారు. కాకతీయుల కాలం నాటి ఆ శిల్పాలపై వేసిన రంగులను తొలగించాలని సూచించారు. అక్కడ విశాలమైన కోట గోడ ఆనవాళ్లు ఉన్నాయని, పునాది కోసం కొండ పైన ఏడడుగుల మేర రాతిని తొలిచారని తెలిపారు. గుట్టపై చాలా చోట్ల బండలను పగుల గొట్టిన గుర్తులు, క్వారీ నిర్వహించిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. సమీపంలోని మరో బండపై ఉలితో చెక్కిన విజయనగర కాలపు ఆంజనేయుడి రేఖా చిత్రం ఉందని తెలిపారు. అలాగే కొండ చెరియల్లో ఆదిమానవులు నివసించిన ఆనవాళ్లు ఉన్నాయని వివరించారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న రంగనాయక స్వామి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

» నిర్వాహకుడితో పాటు ఇద్దరు యువతులు, ఐదుగురు విటుల అరెస్ట్

గద్వాల క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తా సమీపంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. గద్వాల పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా కడపకు చెందిన రమణయ్య అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం బీరెల్లి చౌరస్తా సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కర్నూల్ నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. అలాగే సోమవారం కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతి, అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మరో యువతిని గద్వాలకు పిలిపించి, విటులను రప్పించాడు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు రమణయ్యతో పాటు ఇద్దరు యువతులు, గద్వాలకు చెందిన ఐదుగురు విటులను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడికి విటులు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపినట్లు తెలిసిందని ఎస్ఐ చెప్పారు. ఈ విషయంపై విచారణ చేపట్టి, పూర్తి వివ రాలు తెలుసుకుంటామన్నారు.

ఖాతాల్లో 'రైతు భరోసా'

» జిల్లాలోని 13 గ్రామాలలో 7,829 రైతులకు రూ.12.47 కోట్లు
» సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

గద్వాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జిల్లాలోని 7,829 మంది రైతుల ఖాతాలలో రైతు భరోసా డబ్బు జమ చేసింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 13 మండలాలలోని 13 గ్రామాల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించి ప్రొసీడింగ్స్‌ను అందించింది. మంగళవారం మధ్యాహ్నం వరకు రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాకపోవడంతో కొంత గందరగోళం ఏర్పడింది. కానీ సాయంత్రం 7,829 మంది రైతుల ఖాతాల్లో రూ.12.47 కోట్లు జమ అయినట్లు రైతుల ఫోన్‌లకు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో మల్దకల్ మండలం, నాగర్‌దొడ్డి గ్రామంలో రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకున్నారు.

ఫిట్స్‌తో విద్యార్థి మృతి

» న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం, చిత్రంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, (ఇన్‌సెట్‌లో) విద్యార్థి భరత్ (ఫైల్)

గోపాల్‌పేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్ వచ్చిన ఓ విద్యార్థి అకస్మాత్తుగా మృతి చెందిన ఘటన సోమవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగింది. తోటి విద్యార్థులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఏదుట్ల గ్రామానికి చెందిన ఉడుముల భరత్ (13) గోపాల్‌పేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతూ ఆ పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ప్రతీ రోజులాగే భరత్ నిద్రలేచి స్నానం చేసి, ఏడు గంటల సమయంలో హాస్టల్ ఆవరణలో తోటి విద్యార్థులతో కలిసి చదువుకుంటున్నాడు. ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి భరత్ నేలకూలాడు. దీంతో హాస్టల్ వాచ్‌మన్, భరత్ తోటి విద్యార్థి రామకృష్ణ కలసి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బైక్‌పై తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భరత్ తల్లి ఉడుముల అరుణకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. భరత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. విషయం బయటికి తెలియడంతో ఆసుపత్రి దగ్గరికి విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, మృతుడి బంధువులు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి మృతదేహంతో హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆందోళనకారులను శాంతింపచేశారు. అక్కడికి వచ్చిన వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఈ సంఘటనపై పూర్తి విచారణ చేసి బాధ్యులు ఎవరైనా ఉంటే చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఈ ఘటన జరిగినా ఎస్సీ హాస్టల్ వార్డెన్ జైపాల్‌రెడ్డి అందుబాటులో లేకపోవడం గమనార్హం.

శోకసంద్రంలో బాధిత కుటుంబ సభ్యులు

రెండు సంవత్సరాల క్రితం భరత్ తండ్రి ఉడుముల వెంకటేష్ (38) హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేస్తూ ఐదంతస్తుల భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి అరుణ ఇద్దరు పిల్లలతో సొంత గ్రామంలోనే ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. రెండు రోజుల క్రితం భరత్ టూర్‌కు వెళ్ళాలని తల్లి దగ్గర డబ్బులు తీసుకొని వచ్చాడు. అంతలోనే మృతదేహంగా మారి గ్రామానికి చేరడంతో గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి.

ఐదుగురు బాల కార్మికులకు విముక్తి

అమ్రాబాద్/ ఊర్కొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల కేంద్రం, ఊర్కొండ మండలంలోని ఊర్కొండ పేటల్లో ఐదుగురు బాల కార్మికులకు ఆపరేషన్ స్మైల్ బృందం విముక్తి కల్పించింది. ఆపరేషన్ స్మైల్ అమ్రాబాద్ ఇన్‌చార్జి ఎస్ఐ ఇందిర తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆపరేషన్ స్మైల్ బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అనిల్ బైక్ మెకానిక్ షాపుతో పాటు, మరో షాపులో పనిచేస్తున్న ఇద్దరు బాలలను గుర్తించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ రజిత సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. బాలల్లో ఒకరు ఎనిమిదవ తరగతి, మరొకరు మూడవ తరగతి వరకు చదువుకున్నారని, వారితో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయించాలని యజమానులను ఆదేశించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే హెచ్చరించి పంపించేశారు. కార్యక్రమంలో చిల్డ్రన్ ఫౌండేషన్ ప్రతినిధి జాకీర్‌హుసేన్, చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రమీల, ఆపరేషన్ స్మైల్ సభ్యులు రాముడు, లష్కర్ పాల్గొన్నారు.

- ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం ఆవరణలో కొబ్బరికాయల వ్యాపారి రమేశ్ వద్ద పని చేస్తున్న ముగ్గురు బాలలకు విముక్తి కల్పించినట్లు ఆపరేషన్ స్మైల్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్ల పహాడ్ గ్రామానికి చెందిన రమేశ్ ఊర్కొండపేట ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి ముగ్గురు పిల్లలను పనిలో పెట్టుకున్నాడు. ఆపరేషన్ స్మైల్ బృందం వారికి విముక్తి కల్పించి, నాగర్‌కర్నూల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచింది. మంగళవారం వారిని తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు డీసీపీవో శ్రీశైలం తెలిపారు. రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు లక్ష్మయ్య, ఆపరేషన్ స్మైల్ ఎస్ఐ కృష్ణయ్య, డీసీపీయూ సభ్యులు మధుబాబు, మల్లేశ్, చైల్డ్‌లైన్ అధికారి మల్లీశ్వరి, జూనియర్ అసిస్టెంట్ సప్తగిరి, హెడ్ కానిస్టేబుల్ పద్మావతి, కానిస్టేబుళ్లు రామకృష్ణ, యూసీ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

అర్హులకే సంక్షేమ పథకాలు

» ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్



ఎర్రవల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ద్వారా ప్రజలకు అందిస్తున్న నాలుగు సంక్షేమ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేందుకు అధికారులుగా కృషి చేస్తున్నామని మండల తహసీల్దార్ నరేష్ అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లడారు.

ధరణి సమస్యలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

80దాక పెండింగ్‌లో ఉన్నాయి. 70 పరిష్కరించాం. పది మాత్రమే సమస్యలో ఉన్నాయి. ఇరువురు సమన్వయంతో వస్తే వాటిని విచారణ చేపట్టి పరిష్కరిస్తాం.

భూ భారతిపై ఆదేశాలు వచ్చాయా?

భూ భారతిపై తమకు ఇంకా స్పష్టమైన గైడ్‌లైన్స్ రాలేదన్నారు. ప్రభుత్వం దానిని రూపకల్పన చేస్తుందని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాకే అమలు జరుగుతుంది.

సాగుకు యోగ్యం లేని భూములను గుర్తించారా?

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవసాయ సాగు భూమికే రైతు భరోసా అందుతుంది. మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించాం. మండలంలో 700 ఎకరాలు రైతు భరోసాకు అర్హత లేని గుర్తించాం.

న్యూస్ బాక్స్

అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

ధరూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రణాళికాబద్ధంగా చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రవీంద్రబాబు విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని అల్వాలపాడులో ఎంపీహెచ్ ఎస్‌ను ఎంఈవో సందర్శించారు. ముందుగా తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈవో, వారికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సూచించిన విధంగా చదవాలని, ఏవైన సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులందూ బాగా చదవి 10 జీపీఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

గద్వాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదురోజులగా పట్టణంలోని ఒంటెలపేటలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ చాలెంజర్స్ జట్టు, నవీన్ రెడ్డి జట్టు తలపడగా చాలెంజర్స్ జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకుడు వంట భాస్కర్ తెలిపారు. అనంతరం జట్టుకు షీల్డ్‌తో పాటు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎల్కూరు చిన్న, పరశురాముడు, నవీన్ రెడ్డి, వాహీద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సేవా పతకాలను అందజేసిన ఎస్పీ

గద్వాల క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం పోలీస్ అధికారులకు అందజేశారు. అలంపూర్ సీఐ రవిబాబు, శాంతినగర్ సీఐ టాటాబాబులకు ఉత్తమ సేవలకు గాను ప్రశంస పత్రాలు రాగా వారు ముఖ్యమంత్రి కార్యక్రమంలో ఉండటంతో ఇద్దరికి ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

రాజోళి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మేజర్ పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యను సోమవారం స్థానిక కార్యాలయంలో జడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ నిషాక్ సన్మానించారు. కార్యదర్శికి శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. శివరామయ్య, గజప్ప హుసేన్, అల్వాల శాంతయ్య, లింగన్న పాల్గొన్నారు.

అయిజ తహసీల్దార్‌కు..

అయిజ: తహసీల్దార్‌ను మండల రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను జిల్లా కేంద్రంలో ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు సోమవారం రేషన్ డీలర్లు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, రాముడు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షురాలిగా రాధారెడ్డి

గద్వాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్స్ వారియర్స్ సొసైటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా రాధారెడ్డి నియమితులయ్యారు. సోమవారం సంస్థ ప్రతినిధులు నరేష్, సులోచన నియామకపత్రం అందించారు. అధ్యక్షురాలు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సాగు సరే.. అమ్మకాలు ఎలా?

» ఇటిక్యాలలో అత్యధికంగా కంది సాగు
» కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయని అధికారులు
» ఇబ్బందులు పడుతున్న రైతులు



ఇటిక్యాలలోని కొనుగోలు కేంద్రంలో కందిని విక్రయిస్తున్న రైతులు (ఫైల్)

ఇటిక్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టించి పండించిన పంటలను విక్రయించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో సాగుచేసిన పంట అమ్ముకునేందుకు తక్కువ ధరకు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది కందికి మద్దతు ధర లభించడంతో జిల్లాలో ఈ ఏడాది 44,931ఎకరాల్లో కంది సాగు చేశారు. అత్యధికంగా ఇటిక్యాల మండలంలో 7,271 ఎకరాల్లో, అతి తక్కువగా ధరూరు మండలంలో 4,090 ఎకరాల్లో పంటను సాగు చేశారు. విస్తీర్ణం పెరిగినా అనుకున్నంత మేరకు దిగుబడి మాత్రం రాలేదు. సాధారణంగా ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కాగా ఈ సారి ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల తక్కువ దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. గతేడాది ఇప్పటికే కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సారి కేంద్రం ఏర్పాటు ఊసే లేకపోవడంతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దళారులు క్వింటా కందిని రూ.6వేల నుంచి రూ.6,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం ఏర్పాటు చేస్తే క్వింటాపై అదనంగా రూ.800 నుంచి రూ. వెయ్యి వరకు వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అలంపూర్ వ్యవసాయ మార్కెట్ సుదూరంగా ఉండటంతో వెళ్లేందుకు రైతులకు ఇబ్బందికరంగా మారిందని, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇటిక్యాలలో కంది కొనుగోలును ఏర్పాటు చేయాలని మండల రైతులు ఎమ్మెల్యే విజయుడు దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

చర్యలు తీసుకోవాలి



కందుల కొనుగోలును గతేడాది మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేశారు. మిగతా పంటల కంటే అధికంగా రైతులు చేశారు. మార్కెట్‌కు తరలించేందుకు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి.

-విష్ణువర్ధన్‌రెడ్డి, ఇటిక్యాల

కేంద్రం ఏర్పాటు చేయాలి



మండలంలో అధికంగా కందిని సాగు చేశారు. అధికారులు అలంపూర్ చౌరస్తాలో కందిని కొనుగోలు చేస్తుండగా, ఇక్కడి రైతులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

- శ్రీనివాసరెడ్డి, శివనంపల్లి

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

» డీఎంహెచ్‌వో సిద్ధప్ప



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సిద్ధప్ప

గద్వాల న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సిద్ధప్ప హెచ్చరించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అడ్వయిజరి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను అన్ని పర్యవేక్షిస్తున్నామన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం.. చదవనిద్దాం నినాదంతో జిల్లా అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణికి పిండంలో ఎదుగుదల లోపం, జన్యుకారణాల లోపం ఉంటేనే అబార్షన్ చేయాలన్నారు. ముఖ్యంగా అడ్వయిజరి కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రజలకు బాల్య, మేనరిక వివాహాలు, లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి ప్రసూణరాణి, గైనకాలజిస్ట్ ప్రియాంక, వైద్యుడు శ్యాం, మధుసూదన్‌రెడ్డి, నర్సయ్య, జ్యోత్స్న, చిట్టెమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



ఎంఏఎల్‌డీ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

» ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్

గద్వాల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వం డిగ్రీ కళాశాల వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ వీసీల నియామకాలను గవర్నర్లకు అప్పజెప్పే నిర్ణయాన్ని బీజేపీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. వీసీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి నిబంధనల మార్పు కోసం ఇటీవల యూజీసీ జారీ చేసిన ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నత విద్యారంగానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వీసీ నియామకాలను గవర్నర్ చేతిలో పెట్టి రాష్ట్ర హక్కులను, యూనివర్సిటీ హక్కులను బీజేపీ ప్రభుత్వ నేతృత్వంలో కేంద్రం తన ఆధీనంలో ఉంచుకోవాలని చూస్తుందన్నారు. యూజీసీ ముసాయిదా నిబంధనల ద్వారా విద్యావస్థను రాజకీయ, ఆర్థిక అంశాలకు అనుగుణంగా మార్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. తక్షణమే వీటిని రద్దు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అశోక్, వీర శేఖర్, తిరుమల్, నరసింహులు, వినోద్, కిరణ్ ఉన్నారు.

ఓపీఎస్ వెంటనే అమలు చేయాలి



అయిజ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

గద్వాల సర్కిల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్స్ స్కీం) విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం గద్వాల మండల తహసీల్దార్ మల్లికార్జున్‌కు పీఆర్టీయూ టీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న యూపీఎస్ గెజిట్ నంబర్ 27 ఉత్తర్వును జారీ చేసిందన్నారు. ఓపీఎస్‌ను పోలి ఉండేలా ఉన్న ఈ కంటి తుడుపు ఉత్తర్వును ఉప సంహరించుకోవాలని యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఈదన్న, ప్రధాన కార్యదర్శి కృష్ణ వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

అయిజ: పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ జ్యోతికి సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబేల్, రవి, భీమేష్, నర్సింహులు, సుదర్శన్, శ్యాంసన్, పకీరన్న, తిమ్మప్ప, రామనాయుడు, జహిరుద్దీన్, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

నైతిక విలువలతో చదవాలి: డాక్టర్ లక్ష్మణ్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

అయిజ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సైకాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణా తరగతులకు హాజరై మాట్లాడారు. నేడు టెక్నాలజీ పేరుతో సెల్‌ఫోన్‌లను విరివిగా వాడుతూ చాలా మంది విద్యార్థులు చెడు అలవాట్లకు దగ్గరవుతున్నారన్నారు. ఇంటివద్ద పిల్లలు కూడా ఏమి చేస్తున్నారో అన్న విషయాలను తల్లిదండ్రులు ఖచ్చితంగా గ్రహించాలని సూచించారు. విద్యార్థుల ఎదుగుదలలో వారి కుటుంబానికి కూడా పెద్ద బాధ్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని వాటికోసం కృషిచేస్తే తప్పకుండా ఫలితం దక్కుతుందని సూచించారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి

వడ్డేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ నెల 30న నిర్వహించే సన్నాహక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కొంకల భీమన్న అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు యేసేపు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు' మినీ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం బృందావన్ గార్డెన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో మస్తాన్‌మాదిగ, రాజు మాదిగ, రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

●ధరూరు : సన్నాహక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో నాయకుడు డీవై రామన్న అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పరశురాం మాదిగ, ఆంజనేయులు, వెంకటన్న, సత్యన్న, సంజీవ్, రామన్న, లింగన్న, శ్రీరాం పాల్గొన్నారు.

● అయిజటౌన్: మాదిగలకు న్యాయంగా అందాల్సిన వర్గీకరణను సాధించటమే లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు అన్నారు. సోమవారం అయిజలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మినీ యాత్రను విజయవంతం చేయాలని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేస్తున్న బండ్ల జ్యోతి

గద్వాల న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం గట్టు మండలంలోని ఆలూరుకు చెందిన తిమ్మారెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.30,500 చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి అందజేశారు. కార్యక్రమంలో సుభాన్, రాజశేఖర్, ఆనంద్‌గౌడ్, మేస్త్రి తిమ్మప్ప పాల్గొన్నారు.

ధరూరు ఎస్ఐగా శ్రీహరి



ఎస్ఐ కొండ శ్రీహరి

ధరూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల ఎస్ఐగా కొండ శ్రీహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన అబ్దుల్ షుకూర్‌ను వీఆర్‌పై గద్వాలకు పంపారు. మహబూబ్‌నగర్ పీఎస్ పరిధిలో వీఆర్‌లో ఉన్న శ్రీహరిని ఇక్కడి ఎస్ఐగా నియమిస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. అన్నివర్గాల ప్రజలు నిర్భయంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు అందజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గుంటిపల్లి పాఠశాలకు మైక్, డ్రమ్స్ వితరణ

గద్వాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు సోమవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్ దాదాపు రూ.16వేల విలువగల మైక్‌సెట్టును అందజేశారు. అదేవిదంగా మాజీ సర్పంచ్ తెలుగు తిమ్మప్ప రూ.9వేల విలువగల డ్రమ్స్ బ్యాండ్‌సెట్టును అందజేశారని హెచ్ఎం ప్రభాకర్ శాస్త్రి తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని దాతలు ప్రకటించారు.



అయిజలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మార్కెట్ చైర్మన్ దొడ్డప్ప, నాయకులు

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

» అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప

అయిజ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలంపూర్, అయిజలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాలు నిర్వహించబడుతాయని తెలిపారు. క్వింటా కందులను రూ.7,550 మద్దతు ధరగా కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 12 శాతం తేమ ఉండే విధంగా చూసుకోవాలని, ఏఈవోతో పంట ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు అందజేయాలని తెలియచేశారు.

చదువుకుంటే ధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం

» అదనపు కలెక్టర్ నర్సింగరావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల సర్కిల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చదువు ధైర్యంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బిట్ బ్యాంక్ పుస్తకాల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమ విద్యను ఆసక్తితో కొనసాగిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మార్గం సులభతరం అవుతుందన్నారు. ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం వెంకట్రామయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శాంతినగర్‌కు రెండు అవనిగడ్డ బస్సులు



ఆర్టీసీ బస్సుకు పూజ చేస్తున్న శాంతినగర్ నాయకులు

వడ్డేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నుంచి అవనిగడ్డ డిపోకు చెందిన రెండు కొత్త బస్సులను శాంతినగర్‌కు సర్వీసును ప్రారంభించినందుకు నాయకులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోమవారం శాంతినగర్‌కు చేరుకున్న అవనిగడ్డ డిపోకు చెందిన రెండు కొత్త బస్సులకు స్థానిక నాయకులు పూజ చేసి ప్రారంభించారు. పాత బస్సుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్టీసీ చైర్మన్ నారాయణ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ రెండు బస్సులు ఏపీలోని అవనిగడ్డ నుంచి కర్ణాటకలోని రాయచూర్‌కు వెళతాయన్నారు. కార్యక్రమంలో పూర్ణచంద్రారావు, శ్రీనివాస్‌చౌదరి, గోపాలరావు, రాజా, ముఖర్జి, సాంబశివరావు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల వరకు బస్సులు నడపాలి

» ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు తాండ్రపాడు వాసుల వినతి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

గద్వాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : శాంతినగర్ నుంచి తుమ్మిళ్ల వరకు ఆర్టీసీ బస్సును నడపాలని తాండ్రపాడు గ్రామస్థులు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌శెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. శాంతినగర్ నుంచి కొంకల, ముళ్లదిన్నె, తాండ్రపాడు మీదుగా తుమ్మిళ్ల వరకు ప్రతిరోజు బస్సులు నడపాలన్నారు. రోడ్డు సౌకర్యం బాగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పలు అవసరాల నిమిత్తం శాంతినగర్, కర్నూలు, అలంపూర్ వెళ్లి వచ్చే ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ డిపోలో బస్సుల కొరత ఉన్నందున నడపలేకపోతున్నామని, ప్రభుత్వానికి కొత్త బస్సులను కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో తిమోతి, రవి, దేవవరం, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కాజేయడంపై విచారించాలి



కలెక్టరేట్ వద్ద చేనేత కార్మికులు

గద్వాల న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): థ్రిఫ్ట్ ఫండ్ స్కీంలో కాజేసిన డబ్బులు రికవరీ చేయాలని ప్రియదర్శిని మహిళా చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు భూదార్పు సత్యమ్మ మాట్లాడుతూ.. ఈ పథకంలో లబ్ధిదారులుగా చేరాలంటే ప్రభుత్వ నిబంధన ప్రకారం జియో ట్యాగ్ నంబర్ ఉండి, మగ్గం నేస్తూ కార్మికుడై ఉండాలని, ఆ కార్మికుడి ఆదాయం తన నెలసరి ఆదాయంలో ఎనిమిది శాతం బ్యాంకు ఆర్‌డి-1 ఖాతాలో జమచేస్తే ప్రభుత్వం 16శాతం ఆర్‌డి-2 లో 36 నెలలు జమచేయడం జరుగుతుందన్నారు. ఇందుకు ఒక మగ్గానికి ఒక చేనేత కార్మికుడు, ఇద్దరు అనుబంధ కార్మికులు ఈ స్కీంలో లబ్ధిదారులుగా చేరవచ్చన్నారు. కానీ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేనేత కార్మికుల ముసుగులో ఈ సంవత్సరానికి రూ.కోట్ల పట్టు చీరల వ్యాపారం చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్యాక్స్ రూపంలో జీఎస్టీ చెల్లిస్తూ, ఆదాయ పన్ను చెల్లించే వారు ఈ స్కీంలో లబ్ధిదారులుగా చేర్పి ప్రభుత్వం సొమ్ము రూ.కోట్లు కాజేశారన్నారు. ఒక్క గద్వాల పట్టణంలో కెనారా బ్యాంకు మాత్రమే దాదాపుగా రూ.60-70 లక్షల కుంభకోణం జరిగిందన్నారు. ఇప్పటికైనా చేనేత జౌళీ శాఖ అధికారులు విచారణ చేసి రికవరి చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు కోట నర్సింహులు, మేడం రామకృష్ణ, చిన్ని నాగరాజు, పోతు భీమేష్, బుదర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ విద్యను బోధించాలి

అయిజ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సంప్రదాయాలతో కూడిన విద్యను బోధించేందుకే ఏకల్ విద్యాలయాలు పనిచేస్తున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సంచ్ మాస వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏకల్ విద్యాలయాల్లో ఆరు నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను చేర్చుకుని కథలు, జానపదాలు, నాటకాలు, జానపద పాటలు, అభినయాలు, సుభాషితాలు, నీతిపద్యాలు, ధార్మిక ప్రసంగాలు, దేశభక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మహాదేవమ్మ, బాలకృష్ణ, రంగనాథ్, సోమేశ్వరమ్మ పాల్గొన్నారు.

నిరంతరం పారుతున్న బోరు



గట్టు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపురంలో పంచాయతీకి చెందిన బోరు నిరంతరం పారుతూనే ఉంటుంది. దీంతో నీరంతా వృథా అవుతుంది. ఈ బోరు గ్రామంలోకి ప్రవేశిస్తుండగా పాఠశాల ఎదుటే ఉన్నది. ఈ బోరును పంచాయతీ వారు పట్టించుకోవడం లేదు. గ్రామంలోని మిషన్ భగీరథ నీరు రాక గ్రామస్థులు అవస్థలు పడుతుంటే మరో వైపు ఇలా బోరు ద్వారా నీరు వృథా అవుతున్నది. అధికారులు స్పందించి నాన్‌స్టాప్ బోరుకు స్టాప్‌లాక్ అమర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.